నిలిచిన రోడ్డు పనులు

- కంకరపోసి చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- న్యూశాయంపేట టు భట్టుపల్లి రోడ్డు కోసం ఎదురుచూపులు


న్యూశాయంపేట కోటచెరువు కట్టపై నిర్మాణంలో ఆగిపోయిన రోడ్డు

కాజీపేట అర్బన్ : సీఎం అభయం లేక ఓ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందంటే అవుననే చెప్పాలి. కాజీపేట మండలం న్యూశాయంపేట కోటచెరువు మీదుగా రోడ్డు భట్టుపల్లి వైపుగా బైపాస్ రోడ్డుగా రెండేళ్ల క్రితం నాడు సీఎంఏ నాటి సీఎం అష్యూరెన్స్‌తో రూ.1.50 కోట్లతో అట్టహాసంగా ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కాగా ఎన్నికల్లో నాటి ప్రభుత్వం తారుమారై నూతన ప్రభుత్వం రాకతో బిల్లుపై అభయం లేక ఆగిపోయింది.

కంకర పోసి చేతులెత్తేసిన కాంట్రాక్టర్

నాటి ప్రభుత్వ హయాంలో సీఎం అభయంతో ప్రారంభమైన కోట చెరువు కట్టపై న్యూశాయంపేట నుంచి భట్టుపల్లి వైపుగా రోడ్డు నిర్మాణాన్ని దక్కించుకున్న కాంట్రాక్టర్ కంకర పోసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా బిల్లులు వస్తాయా రావా అనే మీ మాంసలో చేపట్టిన పనులకు కూడా బిల్లు రాకపోవడంతో చేసేది లేక కంకరపోసి ఆపాల్సిన పరిస్థితి నెలకొంది.

బైపాస్ అని వెళ్తే బైక్ పంచరే..

భట్టుపల్లి గ్రామం నుంచి న్యూశాయంపేట, హంటర్‌రోడ్డు, పద్మాక్షికాలనీ, హనుమకొండకు బైపాస్‌గా ఎంతో ఉపయోగపడే ఈ రహదారి కంకరకే పరిమితమైంది. బైపాస్ రోడ్డుపై వెళ్తే సమయంతో పాటు దూరం తగ్గుతుందనుకుంటే జేబుకు చిల్లు పడుతుంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేసిన వాహనాలు గమ్యం చేరుకునే సరికే పంచర్లు అవుతున్నాయి. దీంతో వామ్మో.. బైపాస్ రోడ్డు అంటూ నగరవాసులు జంకుతున్నారు. ప్రస్తుత సీఎం అభయం ఇస్తే మాకు ఈ రోడ్డు వస్తుంది. తక్షణమే అభయం వచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ట్రైసిటీ వాసులు వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

19న నరకాసుర వధ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

ఖిలా వరంగల్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో ఈనెల 19న జరగనున్న నరకాసుర వధ వేడుకల వాల్ పోస్టర్‌ను ఉత్సవ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వం జరిగిన సంఘటనలు నేటి తరానికి తెలియజేయడానికి దీపావళి పర్వదినాన నరక చతుర్దశి రోజు నరకాసుర వధ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గౌతం, రామ్మూర్తి, కొమురెల్లి, మధు, మోహన్, నరసింహ, రాజు, ఆయిలేశం, శివ, సతీష్ పాల్గొన్నారు

ఆర్యవైశ్య మహాసభ ప్రక్షాళన కమిటీ కన్వీనర్‌గా రమేశ్



ఖిలా వరంగల్ : రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రక్షాళన కమిటీ వరంగల్ జిల్లా కన్వీనర్‌గా వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్ పెరకవాడకు చెందిన మునుగోటి రమేశ్ నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కన్వీనర్ ముడిదెడ్డి శ్యాం అధ్యక్షతన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రక్షాళన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేష్‌బాబు సూచనల మేరకు ప్రక్షాళన కమిటీ చైర్మన్ మొగుళ్లపల్లి ఉపేందర్, యాద నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కన్వీనర్‌గా రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఆర్యవైశ్య ప్రతినిధులతోపాటు మహేష్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నృత్యపోటీల్లో జిల్లా కళాకారులకు అవార్డులు



హన్మకొండ కల్చరల్ : ఆల్ ఇండియా డ్యాన్సర్స్ అసోసియేషన్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో నృత్యపోటీలు నిర్వహించారు. హనుమకొండకు చెందిన ది టెంపుల్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు అనిశ్రీ తరెడ్డి కుందూరు 'నట్వార్ గోపికృష్ణ' నేషనల్ అవార్డు, రావుల సాయి సంజనరెడ్డి 'నవోదిత్ కళాకార్ 'అవార్డు అందుకున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యుడిగా రాజనరేంద్రాచారి



హన్మకొండ చౌరస్తా : తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా హనుమకొండలోని న్యూరాయపురకు చెందిన విద్యుత్‌శాఖ కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్కోజ్వల రాజనరేంద్రాచారి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు నియామక ఉత్తర్వులు జారీ చేస్తూ మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్మోహన్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటచారి సూచనల మేరకు పదవి కేటాయించినట్లు పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కుంట అయిలయ్య రచించిన ఇండస్ట్రీయల్ సోషియాలజీ పుస్తకాన్ని మంగళవారం యూనివర్సిటీలో వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో కలిసి ఆవిష్కరించారు. యూనివర్సిటీ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య మనోహర్, అకుట్ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, సోషియాలజీ విభాగం అధిపతి స్వర్ణలత, డాక్టర్ కుంట అయిలయ్య, చంద్రమౌళి, రవి, తదితరులు పాల్గొన్నారు.

లైటింగ్ ఏర్పాటు చేయాలి

కాజీపేట : దీపావళి పర్వదినం సందర్భంగా హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలో లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ స్పందించి లైటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయ సేవ అధికారిక సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే



సమావేశంలో మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

నయీంనగర్ : సఖి కేంద్రం ద్వారా లింగాధారిత హింసకు గురైన బాధిత మహిళలకు అందిస్తున్న ఐదు రకాలైన సేవలు కౌన్సిలింగ్, న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికారిక సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. మంగళవారం 6వ డివిజన్ లష్కర్‌బజార్ సఖీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న సఖి కేంద్రం మహిళలకు భరోసా కల్పిస్తోందన్నారు. డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో సఖీ సేవలు 2017 నుండి అందుబాటులో ఉన్నాయని, 13 మంది సిబ్బందితో సఖీ కేంద్రం 24గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. సెంటర్ అడ్మిన్ హైమవతి, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సెక్రటరీ దామోదర్, కౌన్సిలర్లు పావని, శ్రీదేవి, పాల్గొన్నారు.

ఆర్‌వీఎన్‌ఎల్ జీఎంను కలిసిన నాయకులు



కాజీపేట రూరల్ : సికింద్రాబాద్ లేఖభవన్‌లో కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఆర్ఎంయూ ఇన్‌చార్జ్, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) హెడ్ ఆఫీస్‌లో జనరల్ మేనేజర్ ఆనంద్ చెక్కిళ్లను కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే మల్టిపుల్ కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగాల పేరిట జరుగుతున్న మోసాల విషయాలను ప్రస్తావించారు. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంలో ఉండగా కొందరు వ్యక్తులు కోచ్ ఫ్యాక్టరీలో పలు క్యాటగిరీల్లో ఉద్యోగ నియామకాలు చేపిస్తామని చెప్పి, నిరుద్యోగ యువతీ, యువకుల వద్ద లక్షలాది డబ్బులు వసూలు చేస్తూ మోసం చేస్తున్నారని రైల్వే జేఏసీ జీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం ఆనంద్ రైల్వే జేఏసీ వారితో మాట్లాడుతూ రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఎంట్రెన్స్ వద్ద రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు మోసపోకుండా, దళారులకు డబ్బులు ఇవ్వకుండా, ఉద్యోగాలు రైల్వే సంస్థ పోటీ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాల నియామకాలు చేపడుతుందన్నారు. బోర్డు ఏర్పాటు చేయమని సూచించినట్లు వారు తెలిపారు. రైల్వే జేఏసీ కో కన్వీనర్లు జి.భాస్కర్, ఎం. రాజయ్య, వైస్ చైర్మన్ రాజలింగం, రమేష్ ఉన్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి


హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ధర్మేంద్ర

హన్మకొండ అర్బన్/న్యూశాయంపేట: మార్చి 2024 నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీదర్ల ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కమిటీ బాధ్యులతో కలిసి హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ మార్చి 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలను 18 నెలలు గడిచినా చెల్లించకపోవడం దారుణమన్నారు. అలాగే వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ విజయలక్ష్మికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి కదారి భోగేశ్వర్, కార్యదర్శి గుగులోతు కిషన్ నాయక్, అసోసియేట్ అధ్యక్షులు కందుకూరి దేవదాసు, గౌరవ అధ్యక్షులు ఎం.చంద్రమౌళి, జాయింట్ సెక్రటరీలు ఎండీ.అబ్దుల్ గఫార్, దామోదర్, ఇంద్రసేనారెడ్డి, కిషన్‌నాయక్, కుమారస్వామి, చలం, తదితరులు పాల్గొన్నారు.

1,019 మంది ప్రాణాలు కాపాడాం

హసన్‌పర్తి: తొమ్మిది నెలల కాలంలో మండలంలో 1019 మంది క్షతగాత్రులను కాపాడామని 108 అంబులెన్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీర్ అన్నారు. హసన్‌పర్తిలోని 108 అంబులెన్స్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యాధునిక వైద్య పరికరాలు ఎలా పనిచేస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మందులు అందుబాటులో ఉన్నాయా? అని అడిగారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 నంబర్‌కు డయల్ చేసినట్లయితే 30 సెకండ్లలో కాలర్ జీపీఎస్ ఆధారంగా వాహనం బయలుదేరుతుందన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

కేయూలో ఎంఈఎఫ్, ఎంఎస్‌ఎఫ్ ధర్నా


పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న ఎంఈఎఫ్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని అలాగే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్), ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కేయూలోని పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కేయూ ఎంఈఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ పాడేటి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ చీఫ్ జస్టిస్‌పై కోర్టులో జరిగిన దాడి కేవలం అది ఆయన మీద దాడి కాకుండా యావత్తు భారత దేశంలోని దళితులపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ, సుజాత, వెంకట్, మొగిలి, శ్రీనాథ్, రణధీర్, శ్రీకాంత్, బుచ్చయ్య, గణేష్, దేవమ్మ పాల్గొన్నారు.

22 నుంచి కార్తీక మాసోత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయం ప్రధాన అర్చకుడు, కమిటీ బాధ్యులు

హన్మకొండ : హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని నాగరాజ రాజేశ్వరస్వామి దేవాలయంలో నెల రోజుల పాటు కార్తీకమాసోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీనాగరాజ రాజేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ కుందూరు అనీల్‌రెడ్డి, కార్యదర్శి ఇ.కొండల్ రావు, ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి జీవన్ శర్మ తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో చేసే శివారాధన, దీపారాధన సప్త జన్మల పాతకమును పారద్రోలుతుందన్నారు. ఈ క్రమంలో ప్రతీ ఒక్కరు కార్తీక మాసంలో శివార్చన చేయాలన్నారు. 19 ఏళ్లుగా భక్తుల సహాయ సహకారాలతో దేవాలయంలో అత్యంత పవిత్రంగా, ఘనంగా శాస్త్రబద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట నగర భక్తులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ కార్తీక మాసోత్సవాల్లో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో దేవాలయ కమిటీ పి.విద్యాసాగర్, సభ్యులు ఎస్.సురేందర్, సారయ్య, సదానందరావు, ఆర్ఎల్‌వీ సాయి ప్రసాద్, వైకుంఠం, వరప్రసాద్, వి.రమేశ్, పి.రవిచందర్, కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు

- వరంగల్ బాలరక్షక్ భవన్ చైల్డ్ హెల్ప్‌లైన్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ కల్పన


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కల్పన

కాశీబుగ్గ సెంటర్ : దేశంలో బాలికల స్థాయి ఎంతో విలువైందని, దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దేది బాలికలేనని అలాంటి వారిపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వరంగల్ బాలరక్షక్ భవన్ చైల్డ్ హెల్ప్‌లైన్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ బి.కల్పన, షీ టీం హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ అన్నారు. ఈనెల 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సమితి కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఇండియన్ హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల ఎదుగుదలకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాదేవి, కానిస్టేబుల్ పూర్ణ, సైబర్ క్రైం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్,రాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి శిఖం భూమిపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

హసన్‌పర్తి : మండలంలోని దేవన్నపేట తూర్పు చెరువు శిఖం భూమి అమ్మకంపై రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. 'అమ్మకానికి శిఖం భూమి' అనే కథనం 'సాక్షి'లో ఇటీవల ప్రచురితం కాగా ఇందుకు అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, సర్వేయర్ సుజాతలు క్షేత్రస్థాయిని సందర్శించారు. ఈసందర్భంగా స్థానికులతో మాట్లాడారు. చెరువు శిఖం భూమి చదును చేయడం, మత్తడిని తొలగించడంపై స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. అయితే కబ్జాదారులు కూడా విచారణ వద్ద ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతుల నుంచి రైతుల నుంచి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో చెరువు సర్వే చేస్తామన్నారు.

సంస్థ కార్యక్రమాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న పల్లెపాడు దామోదర్

హన్మకొండ : భారత ప్రమాణాల సంస్థ కార్యక్రమాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని కన్జ్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీనియర్ సెక్రటరీ డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల్లో అవగాహన పెంపొందించడం కోసం ముఖ్యమైన మూడు సంస్థలు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్, ఇంటర్నేషనల్ ఎలక్ట్రో కమిషన్, ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ సంస్థల శాస్త్రజ్ఞుల పరిశోధనలకు అభినందనలు తెలుపుకుంటూ గౌరవించుకోవడం అక్టోబర్ 14 ప్రాముఖ్యతగా చెప్పుకోవచ్చన్నారు. ప్రమాణాల అభివృద్ధి అనేది ఒక నిర్మాణాత్మక ప్రక్రియ అని అన్నారు. విద్యార్థులకు బాల్య దశ నుంచి నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించడం కోసం పాఠశాలలు, కళాశాలలో స్టాండర్డ్ క్లబ్ ఏర్పాటు చేయడం, వినియోగదారుల సంఘాలతో కలిసి సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తూ విని యోగదారుల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి బ్యూ రో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ విశేషంగా కృషి చేస్తుందన్నారు. జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు కవిరాజ్, ఇందిరా, జ్యోత్స్న, మంజుల, ఫిలిప్, పీటర్, చంద్రశేఖర్, సతీష్, వివేక్, రాజేందర్ పాల్గొన్నారు.

పెంచిన ఫీజులు తగ్గించాలి


కేయూ పరిపాలన భవనం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న డీఎస్‌ఏ నాయకులు

విద్యారణ్యపురి : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడివరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కోర్సుల విద్యార్థులకు పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని అశోక జంక్షన్‌లో ఆందోళన నిర్వహించారు. పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, బాధ్యులు ఉల్లేరావుబాన్ని, రాజ్‌కుమార్, నాగరాజు, కార్తీక్, శ్రీరామ్, చరణ్, మహేష్, సునీల్, పవన్, శ్రావణ్,యశ్వంత్ పాల్గొన్నారు.

కేయూలో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో..

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫీజులను యూనివర్సిటీ భారీగా పెంపుదల చేయటంపై నిరసిస్తూ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల విద్యార్థులు మంగళవారం కేయూ పరిపాలనా భవన వద్ద బైఠాయించి ధర్నా చేశారు. పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. కార్యక్రమయంలో డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, అసోసియేషన్ జిల్లా నాయకులు సంజయ్, జాషువా, రాజ్‌కుమార శిథర్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

న్యూశాయంపేట : ఉచిత బస్సుతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను ఆదుకోవాలని ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.రత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ ఉబర్, ఓలా యాప్‌లను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, ఎం.సాగర్, మహబూబ్‌పాషా, వెంకన్న, మదార్, దస్తగిరి, సలాం, యాకూబ్‌పాషా, జానీ, బాబా, రహమతుల్లా, ఖలీల్, లతీఫ్, హమీద్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాజీపేటలో బీజేపీ రాష్ట్ర చీఫ్‌కు స్వాగతం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు బీజేపీ జిల్లా శ్రేణులు మంగళవారం స్వాగతం పలికారు. తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో రాంచందర్‌రావు మంచిర్యాల్ జిల్లాకు వెళ్తూ కొద్ది సేపు కాజీపేట జంక్షన్‌లో దిగి ఆగారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ సీతారాంనాయక్, పార్టీ హనుమకొండ, జనగామ జిల్లాల అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, చాడ రమేష్, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, బీజేపీ నాయకులు నర్సింగ్‌గౌడ్, రవి, భగవాన్ ఉపాధ్యాయ, చాంద్‌పాషా, బాబురావు, కుమార్, ఈశ్వర్, కేదారియాదవ్, తదితరులు కలిశారు.

మాజీ కౌన్సిలర్ సాంబయ్య మృతి


సాంబయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మేయర్ సుధారాణి

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ 8వ డివిజన్ కార్పొరేటర్ బైరి లక్ష్మి భర్త మాజీ కౌన్సిలర్ బైరి సాంబయ్య(65) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం హనుమకొండ కుమార్‌పల్లిలోని ఆయన నివాసంలో మేయర్ గుండు సుధారాణి సాంబయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కార్పొరేటర్లు పల్లం పద్మ, గుండు చందన, శివకుమార్, బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

ముగిసిన గణపతి హోమం

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం గణపతి హోమం నిర్వహించారు. ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు గణపతిని రూ.లక్ష కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసిన పిదప స్వామి వారిని వెండి తొడుగులతో అలంకరింపజేశారు.

బాక్సింగ్ పోటీలో విద్యార్థినికి రజతం

హన్మకొండ : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 12, 13వ తేదీన జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 బాక్సింగ్ పోటీలో మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎత్తరి బింధుమాదవి రజత పతకం సాధించినట్లు హెచ్.ఎం సంధ్యారాణి తెలిపారు.

17న ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

హన్మకొండ అర్బన్: కొత్త కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 17న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు హనుమకొండ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.సక్రు ఒక ప్రటకనలో తెలిపారు. డ్రోన్ టెక్నీషియన్ 48 సీట్లు, ఐఓటీ టెక్నీషియన్ (స్మార్ట్ అగ్రికల్చర్) 48 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు 10/8వ తరగతి పాసై ఉండాలని, అక్టోబర్ 10, 2025 నాటికి 14 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆధార్, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ తప్పసరిగా ఇవ్వాలన్నారు.

కాలనీ అభివృద్ధికి పాటుపడతాం

ఖిలా వరంగల్ : కాలనీ అభివృద్ధికి పాటుపడతామని 43వ డివిజన్ గణేశ్‌నగర్ కాలనీ నూతన అధ్యక్ష,కార్యదర్శులు, కోశాధికారి మిరియాల శ్రీనివాస్, కోటగిరి వీరయ్య, సుతారి రాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నెల్లూరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా గుండు పూర్ణచందర్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు రాధాకిషన్, సాంబయ్య, అశోక్ తెలిపారు.

కరాటే విజేతను అభినందించిన ప్రిన్సిపాల్

న్యూశాయంపేట : ఇటీవల చెన్నైలో నిర్వహించిన వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీల్లో వరంగల్ నగరానికి చెందిన మహ్మద్ ఆసియా(హనుమకొండ, (జి1) మైనారిటీ గురుకులం విద్యార్థి) పోటీల్లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి ప్రతిభ కనబరిచింది. విద్యార్థినిని, ఆమె కుటుంబ సభ్యులను ప్రిన్సిపాల్ ఎం.నీరజ, అధ్యాపకులు అభినందించారు.

ధర్నాను విజయవంతం చేయండి

హన్మకొండ : అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.మహాదేశయ్యను సర్వీస్ నుంచి తొలగించినందుకు నిరసనగా ఈ నెల 15న తపాలా డివిజన్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నిర్వహించే ధర్నాలో యూనియన్లకు అతీతంగా తపాలా ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కేఎంసీ సబ్‌స్టేషన్ పరిధి, కొత్తవాడ ఫీడర్‌లోని ఫిల్టర్‌బెడ్ క్రాస్‌రోడ్, ఆటోనగర్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

రైల్వే ఏడీఆర్‌ఎంను కలిసిన నాయకులు



కాజీపేట రూరల్ : కాజీపేటకు చెందిన రైల్వే మజ్దూర్ యూనియన్ ఇంజనీరింగ్ బ్రాంచి నాయకులు మంగళవారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో రైల్వే ఏడీఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన కె.ముత్యాలు నా యుడును కలిసి పూలబొకే ఇచ్చి సన్మానించారు. ఏడీఆర్‌ఎంను కలిసి కార్మికుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరినట్లు స్థానిక మజ్దూర్ యూనియన్ ఇంజనీరింగ్ బ్రాంచి కార్యదర్శి ఇల్లందుల రాజేందర్ తెలిపారు. కలిసిన వారిలో ఇంజనీరింగ్ బ్రాంచి చైర్మన్ భిక్షపతి, నాయకులు ఉన్నారు.